

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెదకూరపాడు: నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లను నియోజకవర్గ ఆర్వో కందుల శ్రీరాములు, మైక్రో ఇరిగేషన్ పీడీ ఆంజనేయులు బుధవారం పరిశీలించారు.



శ్రీ రంగనాయకునిగా నారసింహుడు

మంగళగిరి: శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి శ్రీ రంగనాయకుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహరి (శుక్ర)
బాపట్ల	6.26	4.43
నరసరావుపేట	6.28	4.45
గుంటూరు	6.26	4.43

న్యూస్‌రీల్

8న కుడికాలువకు నీటి విడుదల

నరసరావుపేట: వేసవిలో తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జున సాగర్ కుడి కాలువకు ఈనెల 8వ తేదీన నీరు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వుల మేరకు కుడి కాలువ ద్వారా 5500 క్యూసెక్కుల నీరు ఈనెల 18వ తేదీవ రకు విడుదల చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కుడికాలువ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని అధికారులు అందరూ తమ పరిధిలో 461 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు తాగునీరు నింపాలని, ఒంగోలుకు తాగునీరు అందించే రామతీర్థం రిజర్వాయర్‌కు నీరు సక్రమంగా సరఫరా అయ్యేందుకు సాగర్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు



నాదెండ్ల: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వేసవిలో పనులు నిర్వహిస్తున్న కూలీలకు నీరు, నీడ, ఫస్ట్‌ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. బుధవారం అన్ని గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించారు. ఈ ఏడాది వేసవిలో పనిచేసే కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్లు వేసి నీడను ఏర్పాటు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు మినరల్ వాటర్ క్యాన్లు అందుబాటులో ఉంచాలన్నారు. మెడికల్ కిట్లలో 14 రకాల మందులతో పాటూ ఎలక్ట్రాల్ పౌడర్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ పుష్పరాజు, టీఏ రాజు ఉన్నారు.

యార్డుకు 1,11,752 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,11,752 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,09,377 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 19,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 85,603 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

దుర్గమ్మ సేవలో ఎన్నికల వ్యయ పరిశీలకురాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగం బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నీనా నిగంకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఎఈవో ఎస్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలతో సత్కరించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బుధవారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. అనంతపురానికి చెందిన శ్రీదుర్గా మారుతీ ఆటోమోటివ్స్‌కు చెందిన ఎస్. వెంకటేశ్వరరావు నిత్యాన్నదానానికి రూ. లక్ష, విజయవాడ పాయకాపురానికి చెందిన పాములపాటి కాశీలింగాచారి కుటుంబం రూ. 1,11,111 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ పర్యవేక్షకులు జగదీష్, అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మండే ఎండలు.. అలసిన గుండెలు

- పింఛన్ కోసం పడిగాపులు
- టీడీపీ ఫిర్యాదుతో ఆగిన వలంటీర్ల సేవలు
- సచివాలయాల వద్దకు వృద్ధుల పరుగులు
- మరింత ఇబ్బందులు పడ్డ దివ్యాంగులు
- బాబుకు ఉసురు తప్పదని శాపనార్థాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలుడి పేరు హరికృష్ణ. దివ్యాంగుడు. నడవలేడు. మాట్లాడలేడు. రేపల్లె పట్టణంలోని 7వ వార్డులో తల్లిదండ్రులతో కలసి ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తుంటారు. గతంలో ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చేవారు. ఈనెల పింఛన్ గ్రామ సచివాలయానికి వచ్చి తీసుకోవాలని చెప్పడంతో బాలుడి తల్లి సుమతి దగ్గర ఉండి ఎండలోనే సచివాలయానికి తీసుకొచ్చింది. ఇలా రావడం వలన ఈ రోజు పనికి వెళ్లలేకపోయినట్లు వాపోయింది. ఇలాంటి వారికి ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తే బాగుంటుందని చెబుతోంది. ఇప్పటికైన జగన్ చేసిన విధంగా ఇంటి దగ్గర ఇవ్వాలని కోరుతోంది.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అవ్వాతాతలకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. చంద్రబాబు దండు పింఛన్ల పంపిణీపై విషం చిమ్మింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందించే పింఛన్లపై పెత్తందారీ తనం కక్ష కట్టింది. దీంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, వలంటీర్ వ్యవస్థ సేవలను నిలుపుదల చేయించారు. దీంతో ప్రతి నెల ఒకటో తేదీ అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు అందించే సేవలు అంతరాయం ఏర్పడింది. వలంటీర్లు ప్రతి నెల తొలి రోజు ప్రతి గుమ్మానికి వెళ్లి నగదు అందించే వారు. ఎన్నికల కమిషన్ పంపిణీ బాధ్యతలను గ్రామ సచివాలయలకు అప్పగించింది. దీంతో మూడు తేదీ మధ్యాహ్నం నుంచి పంపిణీని జిల్లా వ్యాప్తంగా ప్రారంభించారు. అయితే ఉదయం నుంచే పింఛన్ లబ్ధిదారులు గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వేసవి ఎండను లెక్క చేయకుండా లబ్ధిదారులు బారులు తీరారు. వృద్ధులకు, రోగులకు, వికలాంగులకు ఇంటి వద్దకే వచ్చి ఇస్తామని చెప్పినా ఆచరణలో అమలు కాలేదు. సవ్యంగా అందించే పింఛన్ల ప్రక్రియ చంద్రబాబునాయుడు కుటిల యత్నాలతో బ్రేక్ పడటం వలన లబ్ధిదారులు పడుతున్న బాధలు అంతాయింతా కాదు. కొన్ని సచివాలయాల పరిధిలో పింఛన్ పంపిణీ మరింత ఆలస్యం కావటంతో వారు రాత్రి వరకూ అక్కడే ఎదురు చూడాల్సివచ్చింది. అయినా కొందరికి పింఛన్ మొత్తం అందగా చాలా మందికి తొలిరోజు పింఛన్ డబ్బులు ఇవ్వలేదు. మరుసటి రోజు ఇస్తామని సచివాలయ సిబ్బంది సర్దిచెప్పి వెనక్కి పంపారు.

జిల్లాలో పంపిణీ ఇలా..

జిల్లాలో అర్బన్ ప్రాంతాలతో కలిపి 29 మండలాలు ఉండగా 477 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,34,943 మంది పింఛన్ దారులకుగాను రూ.69,28,37,500 మొత్తం చెల్లించాల్సి ఉంది. ఈ నెల 6వ తేదీ నాటికి పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.



బాపట్ల పరిధిలోని ముత్తాయిపాలెం గ్రామంలో పింఛన్ల కోసం గుమిగూడిన జనం

వలంటీర్ల రాజీనామాలు

తొలి రోజు జిల్లా వ్యాప్తంగా పలువురు వలంటీర్లు రాజీనామాలు చేయగా, రెండో రోజు రాజీనామా పరంపర కొనసాగింది. జిల్లాలో అద్దంకి, చీరాల, రేపల్లె, వేమూరు, పర్చూరు నియోజకవర్గాల్లో వలంటీర్లు బుధవారం తమ పోస్టులకు రాజీనామా చేశారు.



కొల్లూరు రెండో సచివాలయంలో పింఛన్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు

చంద్రబాబుపై ఆగ్రహ జ్వాలలు..

పింఛన్లకోసం సచివాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితులు కల్పించిన చంద్రబాబు, ఆయన అనుమాయులపై అవ్వాతాతలు, దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తాము సుదూరంలోని సచివాలయాలకు వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోగలమని నిలదీస్తున్నారు. అనారోగ్యంతో మంచాన పడ్డవారూ పచ్చపార్టీ తీరుపై మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు ఇంటివద్దకు రాకుండా అడ్డుకున్న వారికి ఉసురు తప్పదని, రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెబుతామని వృద్ధులు, దివ్యాంగులు హెచ్చరిస్తున్నారు.

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల: సాధారణ ఎన్నికలలో నామినేషన్ వేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ అయినందున ఎస్సీ అభ్యర్థులు నామినేషన్లను మాత్రమే స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలలో వేమూరు నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ అయినందున ఎస్సీ అభ్యర్థుల నామినేషన్లను మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.25 వేలు డిపాజిట్ చేయాల్సి ఉండగా, ఎస్సీ రిజర్వ్ అభ్యర్థులకు 50 శాతమే డిపాజిట్ చేయవచ్చన్నారు. నామినేషన్ ప్రక్రియ ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటలకు జరుగుతుందన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులు సాయంత్రం మూడు గంటలలోగా ఆర్వో కార్యాలయంలో ఉంటే వారిని అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ సమయంలో ఆర్వో కార్యాలయం వద్ద సీసీ కెమెరాలు, వీడియోల నిఘా ఉంటుందని చెప్పారు. ఈ నెల 26వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుందని వివరించారు.

ఓటరు జాబితాలో నమోదు..

నామినేషన్ వేసే అభ్యర్థి పేరు ఓటరు జాబితాలో ఉండాలని, ఫాం–26 కింద అఫిడవిట్ సమర్పించాలని, మూడు నెలల క్రితం తీసిన ఫొటోలు, నాలుగు నామినేషన్ వేయవచ్చన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతిపాదించే అభ్యర్థులు ఫాం–ఏ, ఫాం–బీలను జత పరచాల్సి ఉంటుందని వెల్లడించారు. కొత్త బ్యాంకు ఖాతా తెరిచిన తదుపరి, ఆ ఖాతానే వినియోగించాలని కోరారు. అభ్యర్థిపై క్రిమినల్ కేసులు నమోదై, అవి పెండింగ్‌లో ఉండడం, లేదా శిక్ష పడి ఉంటే అలాంటి వాటిపై టీవీ ఛానల్స్, పత్రికలలో ప్రచురించాల్సి ఉందని సూచించారు. నామినేషన్ ప్రక్రియ తదుపరి అభ్యర్థులు తమకు ఏజెంట్లు నియమించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, ఆమ్‌ఆద్మీ, బీఎస్పీ నాయకులు ఐ.మాల్యాద్రి, షేక్ మహమ్మద్ గౌస్ బాషా, కె.వి.రామకృష్ణ, డి.రవి, ఎం.కోటేశ్వరరావు, ఎ.బాలాజీరెడ్డి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జనన, మరణాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఏప్రిల్ ఒకటి నుంచి జనన, మరణాల రికార్డులను అన్ని ప్రైవేటు ఆస్పత్రుల వారు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో, క్లీనిక్‌లలో నమోదైన జనన, మరణాలన్నింటిని హెచ్‌ఎంఐఎస్, సీఆర్‌ఎస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం తప్పనిసరిగా కమిషనర్ ఆదేశాలను అందరూ పాటించాలని డీఎంహెచ్‌ఓ వెల్లడించారు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్ జగన్ ధ్యేయం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు



వేమూరులో ఎన్నికల ప్రచారంలో వరి కూటి అశోక్‌బాబు

వేమూరు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్, సత్యనారాయణ కాలనీ, ధర్మపురం , వేమూరులో బుధవారం నిర్వహించారు. దళితవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని చెప్పారు. ప్రజా ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. అవ్వాతాతలకు, దివ్యాంగులకు అందించే పింఛన్ పంపిణీని అడ్డుకునేందుకు టీడీపీ కుట్ర చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో కోగంటి లవ కుమార్, ఎంపీపీ యల్లమాటి మోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు గాజుల హేమలత, గ్రామ సర్పంచి సజ్జా లక్ష్మీతిరుపతమ్మ, బెల్లం కొండ శివపార్వతి, తలతోటి సువర్ణరావు, దున్నా మేరీసుబాబు, పాముల అనిల్, అమర్తలూరు వెంకయ్య, పిల్లి శ్యామ్, బొల్లెదు గోపి, పాముల శ్రీనివాసరరావు, దొప్పలపూడి జ్యోతిబాబు, గుమ్మడి దానియేలు, దాసరి ముత్తయ్య, బొల్లిశెట్టి ప్రభాకరావు, దాది సుబ్బారావు, గాజుల మోహన్, ఉప సర్పంచి తలతోటి ప్రదీప్, ఎలిచర్ల దేవదానం, వేమూరి అనిల్, గాజుల భాను ప్రకాశ్, గొడుకు ప్రకాశ్, గాజుల చినభాను, తలతోటి జిగిన్‌బాబు పాల్గొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఎన్టీఆర్ స్టేడియం, అన్నమయ్య పార్కు సందర్శన

పట్నంబజారు: ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేసుకెళ్లడం అనేది వైఎస్సార్ సీపీ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఆమె బుధవారం గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం, అన్నమయ్య పార్కులను సందర్శించారు. ఎన్టీఆర్ స్టేడియంలో కొద్దిసేపు షటిల్ ఆడి అక్కడివారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గుంటూరును రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబట్టేలా ప్రణాళిక ప్రకారం పనిచేసుకెళుతున్నామని చెప్పారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా మారు మూల రోడ్లను కూడా నిర్మించామని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా నగరాన్ని తీర్చిదిద్దడం తన లక్ష్యమన్నారు. బృందావన్‌గార్డెన్స్ సెంటర్‌లోని ఎన్టీఆర్ స్టేడియంకు వచ్చిన వాకర్స్‌ను, క్రీడాకారులను పలుకరించారు. స్టేడియానికి సంబంధించి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి అన్నమయ్య పార్కుకు వెళ్లి కొద్దిసేపు వాకింగ్ చేస్తూ వాకర్స్‌తో ముచ్చటించారు. అభివాదం చేసుకుంటూ ముందుకు నడిచారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ గోపి శ్రీనివాస్, 35వ డివిజన్ ఇన్‌చార్జి టీఎల్‌పీ ఆంజనేయులు, 38వ డివిజన్ ఇన్‌చార్జి బొగిసం ప్రసాద్, సచివాలయ కన్వీనర్‌లు వెంకాయమ్మ, మరియమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు హేమంత్ నాయుడు, కామినేని విజయ్, గంటి, పరసా వెంకటేశ్వరరావు, ప్రసన్న, కొండపనాయుడు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో షటిల్ ఆడుతున్న మంత్రి విడదల రజిని

టీడీపీకి అసమ్మతి సెగ

- గుంటూరు తూర్పులో అభ్యర్థి నసీర్ వైఖరిని వ్యతిరేకిస్తున్న తమ్ముళ్లు
- సర్వ సభ్య సమావేశానికి నేతల గైర్హాజర్
- కార్పొరేటర్లు, కార్పొరేటర్ అభ్యర్థులు ఈ సమావేశానికి దూరం
- తూర్పులో ఉన్న 22 మందిలో నలుగురే హాజరు
- 18 మంది కార్పొరేటర్ అభ్యర్థులు డుమ్మా

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీకి గుంటూరు తూర్పులో అసమ్మతి సెగ తగిలింది. ఆ పార్టీ అభ్యర్థి నసీర్ అహ్మద్ వైఖరిని పార్టీలోని సీనియర్లు, డివిజన్ స్థాయి నాయకులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. కనీసం సీనియర్ నేతలకు గౌరవం ఇవ్వకుండా టీడీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అహ్మద్ వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. బుధవారం తూర్పు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి చాలామంది పార్టీ నేతలకు పిలుపు లేకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం తన వర్గానికి సంబంధించిన వ్యక్తులను మాత్రమే పిలిచి, సీనియర్లకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని ఆ పార్టీ నేతలు నసీర్ అహ్మద్ తీరుపై మండిపడుతున్నారు.

కూటమి నేతలు..

తూర్పు నియోజకవర్గానికి సంబంధించి కూటమి నేతలుగా ఉన్న జనసేన నగర అధ్యక్షుడు నేరేళ్ల సురేష్ బుధవారం జరిగిన సమావేశానికి హాజరు కాలేదు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పోటీ చేసిన ఓడిపోయిన కార్పొరేటర్ అభ్యర్థులు కూడా సమావేశం వైపు చూడలేదు. నియోజకవర్గంలో మైనార్టీ నాయకులు కూడా కనీస పిలుపు లేకపోవడంతో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫిరోజ్, బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు నేతలు హాజరు కాలేదని సమాచారం. ఎన్నికల సమయంలో విస్తృత స్థాయి సమావేశం జరిగేటప్పుడు కూడా పార్టీ నేతలు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించడంపై మండి పడుతున్నారు. సీనియర్లకు కనీస గౌరవం లేకుండా పోయిందని, నసీర్ అహ్మద్ వచ్చిన నాటి నుంచి ఇదే విధంగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. నియోజకవర్గంలో సీనియర్ నేతలైన దాసరి రాజా మాస్టార్, మద్దిరాల మ్యానీలకు కూడా కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 22 డివిజన్లు ఉంటే అందులో నాలుగు మాత్రమే తెలుగుదేశం గెలవగా, 18 డివిజన్లు వైఎస్సార్ సీపీ గెలుచుకుంది. ఈ డివిజన్లలో ఉన్న తెలుగుదేశం అభ్యర్థులను కనీసం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019లో ఓడిపోయినప్పటి నుంచి క్యాడర్‌ను పట్టించుకోలేదని, ఇప్పుడు కూడా ఇదే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలాగే వ్యవహరిస్తే మరోసారి ఓటమి తప్పదని చెప్పుకుంటున్నారు.

బీజేపీ కండువా ఏదీ..

కూటమిలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉన్న విషయం తెలిసిందే. అయితే నసీర్ అహ్మద్ కనీసం ఇప్పటి వరకు బీజేపీ కండువా కూడా ధరించకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో బీజేపీ నేతలు అతడి తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. కూటమిలో బీజేపీ ఉన్నప్పటికీ నసీర్ అహ్మద్ ఎందుకు తన భుజంపై బీజేపీ కండువా వేసుకోరంటూ సూటిగా ప్రశ్నిస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో క్రోధి వేడుకలు



విలేకరులతో మాట్లాడుతున్న దుర్గగుడి ఈఓ రామరావు, వైదిక కమిటీ సభ్యులు తదితరులు

- 9 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు
- ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కొలువైన ఇంద్రకీలాద్రిపై ఈ నెల తొమ్మిదో తేదీన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకుని అమ్మవారికి స్నపనాభిషేకం, విశేష పూజలతో పాటు పంచాంగ పఠనం జరుగుతుందని పేర్కొన్నారు. తొమ్మిదో తేదీ నుంచి 27 వరకు పండుగలు, పర్వదినాలు ఉన్న నేపథ్యంలో బుధవారం దేవస్థానం మీడియా సమా వేశం ఏర్పాటు చేసింది. ఈఓ రామరావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, రంగావఝల శ్రీనివాసశాస్త్రి, ఈఈ ఎల్.రమా, ఏఈఓ ఎన్.రమేష్‌బాబు ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈఓ రామరావు ఉత్సవాలు, ప్రత్యేక పూజా వివరాలను వివరించారు. తొమ్మిదో తేదీన క్రోధి నామ సంవత్సరాదిని పురస్కరించుకుని తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజల అనంతరం ఉదయం ఎనిమిది గంటలకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉగాది పర్వదినం నేపథ్యంలో పండుగ శోభ ఉట్టి పడేలా అమ్మవారి ఆలయాన్ని మామిడి తోరణాలు, అరటి పిలకలతో అందంగా అలంకరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై పంచాంగ పఠనం జరుగుతుందన్నారు. సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు వెండి రథంపై నగర వీధుల్లో విహరిస్తారని పేర్కొన్నారు.

చైత్రమాస వసంత నవరాత్రులు

చైత్రమాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి విశేష పుష్పార్చన జరుగుతుందని ఈఓ రామరావు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి పుష్పాలతో విశేష అర్చన జరుగుతుందని పేర్కొన్నారు. అమ్మవారికి రోజుకో విశేషమైన పుష్పాలతో అర్చన జరుగుతుందని, ఈ సేవలో భక్తులు భాగస్వాములు కావచ్చని సూచించారు. సేవలో పాల్గొనే వారు రూ.2500 టికెటు కొనుగోలు చేయాలని తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు సేద తీరేందుకు పందిళ్లలో కూలర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇక దాహార్తిని తీర్చేందుకు పలు ప్రాంతాల్లో వాటర్ కూలర్లు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. మరో వైపున ఆలయ ప్రాంగణంలో దాతలు, భక్తుల సహకా రంతో మజ్జిగ వితరణ చేస్తున్నామన్నారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ అమ్మవారికి జరిగే విశేష పుష్పార్చనలో భక్తులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ధూళిపాళ్ల బరితెగింపు

- ఎన్నికల ప్రచారంలో బెదిరింపులు

చేబ్రోలు: టీడీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి బరితెగించారు. ఎన్నికల ప్రచారంలో రైతులను బెదిరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై ప్రజలు మండిపతున్నారు. వారంరోజుల క్రితం చేబ్రోలు మండలం వడ్లమూడిలోని ముస్లిం మైనార్టీలకు చెందిన ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఒక వర్గానికి చెందిన వారిని హెచ్చరింపు ధోరణిలో ఆవేశంతో ప్రసంగించారు. సంగం డెయిరీ ముందు ట్రాక్టర్లతో కాని, ద్విచక్ర వాహనాలతో నాయకులు వైఎస్సార్ సీపీ జెండాలతో కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించినట్లు సమాచారం. కొద్ది కాలం క్రితం ఏలూరుకు చెందిన రైతులు సంగం డెయిరీ వద్దకు వస్తే ఏమి జరిగిందో అందరికి తెలుసు కదా అన్ని గొప్పగా చెప్పుకున్నారు. వారిని తన్ని తరిమేశామని జాగ్రత్తగా ఉండాలని అదే పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. ఇదే గ్రామానికి చెందిన వారు కదా అని ఊరుకుంటున్నట్లు చెప్పారు. టీడీపీకి చెందిన వారిని రెచ్చగొట్టే విధంగా వార్నింగ్ ఇస్తూ బెదిరింపులతో నరేంద్ర ఊగిపోయారు. ఏలూరుకు చెందిన రైతులకు బోనస్ డబ్బులు ఇవ్వాలని అడగటానికి వచ్చిన రైతులను తానే కొట్టిచ్చినట్లు గొప్పగా చెప్పుకోవటంపై గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల పొన్నూరు మండలంలోని చింతలపూడిలోని టీడీపీ నేతకు చెందిన రైస్ మిల్లులో భారీ స్థాయిలో సైకిళ్లను ఎన్నికల అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 567 సైకిళ్ల మీద టీడీపీ నేత ధూళిపాళ్ల, చంద్రబాబుకు చెందిన ఫొటోలతో ఉన్న సైకిళ్లను ఓటర్లకు ప్రలోభ పెట్టడానికి తీసుకువచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను జీర్ణించుకోలేని నరేంద్ర సహనం కోల్పోయి మాట్లాడుతుండటంతో టీడీపీకి చెందిన నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రూ.1.73లక్షల విలువైన విత్తనాలు సీజ్

నరసరావుపేట రూరల్: రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయ అధికారులు పట్టణంలోని స్టేషన్ రోడ్డు విత్తన దుకాణాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించి, రూ.1,73,900 విలువైన 593 కేజీల విత్తనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో కార్యాలయ ఏడీఏ ఏ.మద్దిలేటి, ఏవో బి.వి.సురేష్, ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు పాల్గొన్నారు. అమౌంట్ సోర్స్ సర్టిఫికెట్స్, స్టాక్ రిజిస్టర్స్ పరిశీలించారు. భవాని ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.46,800 విలువైన ఐదు కేజీలు, శ్రీ మహాలక్ష్మీ సీడ్స్‌లో రూ.78,300 విలువైన 444 కేజీలు, లక్ష్మీప్రియ సీడ్స్‌లో రూ.48,800 విలువైన 144కేజీల విత్తనాలను సీజ్ చేశారు. రవాణా ఎక్కడి నుంచి జరిగింది వివరాలు నమోదు కాకపోవడంతో సీజ్ చేసినట్టు ఏడీఏ మద్దిలేటి తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సంతకాలతో కూడిన బిల్స్ ఇవ్వాలని దుకాణదారులకు తెలిపారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన ఇంటర్ దూరవిద్య ప్రాక్టికల్స్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియేట్ ప్రయోగ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో నిర్వహించారు. పట్టణంలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల, కేఆర్ జూనియర్ కళాశాలలోని కేంద్రాల్ని బుధవారం ఏపీఓఎస్ఎస్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి మూల్యాంకనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో మూల్యాంకన కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయన వెంట ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ సోము మల్లయ్య, ఎం.గోపాలకృష్ణ, పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ కె.ఎం.ఏ.హుస్సేన్ ఉన్నారు.

జగనన్నతోనే పేదల స్థితిగతుల్లో మార్పు



పేటేరు గ్రామంలో ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేశ్



పేటేరులో నిర్వహించిన ప్రచారంలో మోపిదేవి, డాక్టర్ ఈవూరు గణేశ్ తదితరులు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: పేదల స్థితిగతుల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన కృషి ఎనలేనిదని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పేటేరు గ్రామంలో బుధవారం సాయంత్రం ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సామాన్య ప్రజానీకానికి ఆర్థిక భద్రతను కల్పించే దిశగా జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలు దేశానికే దిక్సూచిగా నిలిచాయన్నారు. జగనన్న సంస్కరణలతోనే పేద, మధ్యతరగతి వ్యక్తుల జీవితాలలో వెలుగులు నిండాయన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులను ఇంటింటికి వెళ్లి తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేసిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రజల చెంతకే పాలన చేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబానికి అండగా నిలిచిన జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి మరోమారు పట్టం కట్టాలని కోరారు. అంతకుముందు గ్రామదేవత మహాలక్ష్మి గుండె పాటమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ మోపిదేవి, పార్టీ అభ్యర్థి గణేష్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్ కనపర్తి వసుమతి, మండల ఉపాధ్యక్షురాలు రావు నెహ్రూలక్ష్మి, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌ఛార్జ్ రవికిరణ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ముఖ్యనాయకులతో సమావేశమైన మోపిదేవి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గణేశ్

రేపల్లె రూరల్: నవరత్నాల్లో భాగంగా అమలైన సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల పెన్నిధిగా నిలిచారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు కొనియాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ముఖ్యమంత్రికి అండగా నిలవాలని ఆయన అభ్యర్థించారు. పట్టణంలోని 20, 21, 24 వార్డుల ముఖ్యనాయకులు, ప్రజలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల స్వయంసమృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి చేశారన్నారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింత సంక్షేమం ప్రజలకు చేరువవుతుందన్నారు. సీఎం బలపరిచిన డాక్టర్ ఈవూరు గణేశ్‌ను ఆదరించి భారీ ఆధిక్యతతో గెలిపించాలని ఆయన కోరారు.

మోపిదేవి చలవే : ఈవూరి గణేశ్

పార్టీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేశ్ మాట్లాడుతూ మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారన్నారు. తన విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా 21, 24 వార్డులలోని మసీదులు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, ఐఆర్ఈఎఫ్ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఇమ్మాన్యుయేలు రెబ్బా, నాయకులు మోపిదేవి రాజీవ్, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వసనీయత.. నయవంచన మధ్యే పోటీ

పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ



తనుబొద్దివారిపాలెంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న యడం బాలాజీ

యద్దనపూడి: రాబోయే ఎన్నికలు విశ్వసనీయతకు, నయవంచనకు మధ్య జరుగుతున్న పోరాటానికి ప్రతీక అని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అభివర్ణించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కష్టాలెన్ని ఎదురైనా పేదల కన్నీటిని తుడిచి విశ్వసనీయతకు మారుపేరైన జగన్‌మోహన్ రెడ్డికి, మాట తప్పడమే అలవాటుగా నయవంచన చేస్తోన్న చంద్రబాబునాయుడుకు మధ్య పోరాటాన్ని ప్రజలు చూస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం, చిమటవారిపాలెం గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. తనుబొద్దివారిపాలెం కల్యాణ మండపంలో పార్టీ సీనియర్ నాయకుడు తనుబొద్ది మస్తాన్‌రెడ్డి (కేపాల్‌రెడ్డి) ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యడం బాలాజీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమష్టి కృషితో పర్చూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసేలా చిత్తశుద్ధి కనబరచాలన్నారు. సంక్షేమ పథకాలకు మోకాలడ్డుతున్న చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని ఆయన జోస్యం చెప్పారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి మెజార్టీ సీట్లతో రెండోసారి సీఎం కావటం ఖాయమన్నారు. త్వరలోనే ప్రజామోద మేనిఫెస్టోను సీఎం జగన్ ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా నందిగం సురేశ్ ను భారీ ఆధిక్యతతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పులగం రజనీ, సర్పంచ్‌లు చల్లా అన్నపూర్ణమ్మ, మున్నంగి వెంకాయమ్మ, కొడవలి అప్పయ్యచౌదరి, రాయి పృథ్వీ రాజ్, తనుబొద్ది రామిరెడ్డి, వీరారెడ్డి, కల్లం వెంకటరెడ్డి, మువ్వల రాంబాబు, గనిపిశెట్టి వెంకట్రావు, పఠాన్ అయ్యప్పఖాన్, చెరుకూరి వేణు, మార్నెళ్ల శ్రీధర్, రావి రవిబాబు, తేళ్ల చుక్కయ్య, తూబాటి బాలకృష్ణ, చిలుకూరి కృష్ణయ్య, గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి, నక్కా పోతిరెడ్డి, అట్లూరి లక్ష్మారెడ్డి తమ్మలూరి జాను, కల్లం మోహన్‌రెడ్డి, మున్నంగి పోలిరెడ్డి, కొత్త వీరారెడ్డి , ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమూరులో మరోసారి విజయం సాధిస్తాం

- పేదలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలి
- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- వైఎస్సార్ సీపీలో చేరిన జై భీమ్‌రావ్ భారత్ పార్టీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి జడా రవీంద్రబాబు



వరికూటి అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జడా రవీంద్రబాబు

భట్టిప్రోలు: టీడీపీ, జనసేన, బీజేపీలది అనైతిక పొత్తు అని, అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటంలో నిజాయతీ ఉందని ఆ పార్టీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితుడైన జై భీమ్‌రావ్ భారత్ పార్టీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి జడా రవీంద్రబాబు బుధవారం తన కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలసి ఎన్నికల ప్రచారంలో ఉన్న అశోక్‌బాబు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వరికూటి అశోక్‌బాబు పని తీరుకు ఆకర్షితులమై అధికార పార్టీలో చేరినట్లు రవీంద్ర తెలిపారు. వేమూరు నియోజకవర్గంలో అశోక్‌బాబు విజయానికి పార్టీ శ్రేణులతో కలిసి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. అశోక్‌బాబు మాట్లాడుతూ పేదలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని, కొత్తగా పార్టీలో చేరిన వారంతా దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఈ సారీ వేమూరులో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సయ్యద్ సిరాజుద్దీన్, కరింశెట్టి బాలు తదితరులు ఉన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన గుంటూరు బార్ అసోసియేషన్



హైకోర్టు సీనియర్ జడ్జి నరేంద్రను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు

నగరంపాలెం: హైకోర్టు సీనియర్ జడ్జి, గుంటూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ జి.నరేంద్రను బుధవారం గుంటూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైకోర్టు అవరణలోని ఆయన ఛాంబర్‌లో సమావేశమై, శాలువాలతో సన్మానించారు. న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేయాలని హైకోర్టు సీనియర్ జడ్జి జి.నరేంద్ర సూచించారని బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని అభినందించారని పేర్కొన్నారు. హైకోర్టు సీనియర్ జడ్జిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, కోశాధికారి దేవదాస్, పలువురు న్యాయవాదులు ఉన్నారు. అలాగే హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల ఐదున జిల్లా కోర్టు అవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో జరగనున్న బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలుకు హాజరవ్వాలని కోరినట్లు బ్రహ్మారెడ్డి తెలిపారు.

హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరణ

- బెడిసి కొట్టిన పథకం
- హత్య కేసులో నలుగురు అరెస్టు



సమావేశంలో డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, సిబ్బంది

చిలకలూరిపేట టౌన్: వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తిని హత్య చేసి, దాన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితుల్ని బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన ఎద్దు ఏసుబాబు (41) కరెంటు పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుంటాడు. అతడి భార్య చనిపోవడంతో తొమ్మిది సంవత్సరాల కిందట పసుమర్రు గ్రామానికి చెందిన రజినితో రెండో వివాహమైంది. మురికిపూడి గ్రామానికి చెందిన సూరబోయిన మురళీకృష్ణ వద్ద రజిని పనిచేసే క్రమంలో అతడితో పరిచయమైంది. ఇది వివాహేతర సంబంధంగా మారింది. దీనికి ఎద్దు ఏసుబాబు అడ్డుగా ఉన్నడని భావించి తొలగించుకోవాలనుకున్నారు. మార్చి 28న మురళీకృష్ణ, రజిని పథకం పన్నారు. మురళీకృష్ణ మిత్రుడు రామకోటేశ్వరరావు ద్వారా ఎద్దు ఏసుబాబును వారి పొలానికి మద్యం తాగడానికి పిలిచారు. అనంతరం అతడిపై వెనుక నుంచి కర్రతో తలపై ఒంటరి ఏసుబాబు దాడి చేశాడు. గాయపడిన ఎద్దు ఏసుబాబు గుండెలపై కూర్చొని ఊపిరి అందకుండా చేసి చంపాడు. మృతదేహాన్ని సమీపంలోని పొగాకు కంపెని వద్ద వేసి, వాచ్‌మన్‌తో యాక్సిడెంట్‌లో ఎవరో చనిపోయారని నిందితులు చెప్పారు. మృతుడి ఫోన్ నుంచి బంధువులకు ఫోన్ చేయించారు. వారు మృతదేహాన్ని తీసుకువెళ్లి చూడగా గాయాలు ఉండటంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి సోదరి మందా సువార్తమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేసి హత్య కేసు ఛేదించారు. నిందితులైన సూరబోయిన మురళీకృష్ణ, ఒంటరి ఏసుబాబు, సూరబోయిన రామకోటేశ్వరరావుతో మృతుడి భార్య రజినీని అరెస్టు చేశారు. సమావేశంలో రూరల్ సీఐ పి.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు జి. రవికృష్ణ, వి. బాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ దూరవిద్య ప్రాక్టికల్స్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియేట్ ప్రయోగ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో నిర్వహించారు. పట్టణంలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల, కేఆర్ జూనియర్ కళాశాలలోని కేంద్రాల్ని బుధవారం ఏపీఓఎస్ఎస్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి మూల్యాంకనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ సోము మల్లయ్య, ఎం.గోపాలకృష్ణ, పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ కె.ఎం ఏ.హుస్సేన్ ఉన్నారు.

150 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామాలు చేసిన సంతమాగులూరు మండల వలంటీర్లు

- సంతమాగులూరు మండలంలో మూకుమ్మడి నిర్ణయం
- చంద్రబాబు చర్యకు నిరసనగా

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ సంతమాగులూరు మండలానికి చెందిన 150 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా చేశారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందిస్తూ ప్రజా సేవ చేస్తోన్న తమపై చంద్రబాబు రాజకీయ రంగును పూసి, మనో భావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించడాన్ని వారంతా తప్పుబట్టారు. రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని ముక్తకంఠంతో హెచ్చరించారు. ఈ మేరకు 150 మంది తమ రాజీ నామా పత్రాలను ఎంపీడీఓకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు రూ. 5వేల గౌరవ వేతనంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అయితే తమపై కుట్రపూరితంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన చంద్రబాబుకు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని వలంటీర్లు స్పష్టం చేశారు.

జీజీహెచ్‌లో రెండో కిడ్నీ మార్పిడి



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్ గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో రెండో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు రంగం సిద్ధమైంది. ఈనెల 16న ఆపరేషన్ చేసేందుకు సంబంధిత వైద్య విభాగం సమాయత్తమైంది. వివరాల్లోకి వెళితే..ఎనిమిది నెలల నుంచి మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి జీజీహెచ్ కు వచ్చాడు. ఆసుపత్రి మూత్రపిండాల విభాగ వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేశారు. కిడ్నీ మార్పిడి చేయాలని సూచించారు. అందుకు రోగి తండ్రి దానం చేసేందుకు ముందుకు వచ్చాడు. ఈ నెల 16న కిడ్నీ మార్పిడి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా..ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం నెఫ్రాలజీ వార్డును సందర్శించారు. రోగిని పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నారకోడూరు గ్రామానికి చెందిన కె.వినోద్ (33) ఫిబ్రవరి 26 న జీజీహెచ్‌కు వచ్చాడు. ఏడెనిమిది నెలలుగా కిడ్నీ సమస్య వేధిస్తుందని తెలిపాడు. అన్ని రకాల పరీక్షలు చేశాం. రోగి, అతని తండ్రి రక్తం ఒకటే కావడంతో కిడ్నీ మార్పిడికి మార్గం సుగమమైంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే జీజీహెచ్ లో తొలి కిడ్నీ మార్పిడి విజయవంతంగా జరిగిందని, ఆయన ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. కాగా వినోద్ కు జరగనున్న కిడ్నీ మార్పిడి రెండోదని తెలిపారు.

టీడీపీ గ్రాఫ్ నానాటికీ పడిపోతోంది

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీకి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పట్నంబజారు తెలుగుదేశం పార్టీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖమంత్రి వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదలకోసం పుట్టిందని, నిజమైన న్యాయం పేదలకు అందాలంటే సీఎం జగన్ సారథ్యంలో ఆపార్టీ అధికారంలోకి రావాలని ఆమె వ్యాఖ్యానించారు. గుంటూరు 22వ డివిజన్‌కు చెందిన పలు కుటుంబాలు బుధవారం తెలుగుదేశంపార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరంతా చంద్రమౌళి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ నాయకుడు గేదెల రమేశ్ ఆధ్వర్యంలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి రజిని కండువాలు కప్పి స్వాగతించారు. వలంటీర్ల విషయంలో టీడీపీ దుందుడుకు చర్యలే వారి మెడకు చుట్టుకున్నాయన్నారు. పింఛను లబ్ధిదారులు మళ్లీ పాత రోజులను తలుచుకుని బాధపడుతున్నారని ఆమె అన్నారు. వీటికి తోడు మంగళగిరిలో లోకేశ్ చేసిన వ్యాఖ్యలకు ప్రజల్లో అప్పుడే అలజడి మొదలైందన్నారు. అధికారంలోకి వస్తే తాము చెప్పిన వారికే పథకాలు ఇవ్వాలని, లేకపోతే అంతు చూస్తానంటూ లోకేశ్ చేసిన వ్యాఖ్యలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు.

టీడీపీకి టాటా..

అంతకు ముందు షేక్ బాజీ (ట్రాన్స్ పోర్ట్), తంగిరాల మార్కొండారెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో షేక్ మున్ని, షేక్ నీలూ, షేక్ సిరాజున్నీసా, షేక్ ఫాతిమాన్, షేక్ నూర్జహాన్ షేక్ నీలోఫర్, షేక్ పర్వీన్ సుల్తానా, షేక్ పర్వీన్, పఠాన్ గౌసియా, షేక్ గౌసియా బేగం, షేక్ మాబున్నీ, ఎం.సామ్రాజ్యలక్ష్మి, షేక్ బీబీ జాన్, ఈశ్వరమ్మ, జి.వెంకటేశ్వరమ్మ, పఠాన్ మున్ని, షేక్ దుర్గ, షేక్ బుజ్జి, షేక్ సైదమ్మ తదితరులు ఉన్నారు.